క్లుప్తంగా

పీడీఎస్‌యూ సభలను జయప్రదం చేయాలి

బుట్టాయగూడెం: పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవ సభలను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.వినోద్ కోరారు. ఉత్సవ మహాసభల పోస్టర్‌లను సోమవారం బుట్టాయగూడెంలో విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో, నవంబర్ 5న ఏపీలోని విజయవాడ ఎంబీకే భవనంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు చదల దుర్గాప్రసాద్, కోటి చుక్కల పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

2న లక్ష దీపోత్సవం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని రాములమ్మ చెలకలోని శ్రీ సూర్యకిరణ్ కల్యాణ మండపంలో నవంబర్ 2వ తేదీన శ్రీనివాసునికి లక్షదీపోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణపరం దరాస భజన మండలి ప్రతినిధులు తెలిపారు. సోమవారం ఆహ్వానపత్రాన్ని ఆవిష్కరించారు.

రైతు సత్తిరాజుకు పురస్కారం



సుంకర సత్తిరాజును సత్కరిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

కొయ్యలగూడెం: బయ్యనగూడెం గ్రామానికి చెందిన రైతు సుంకర సత్తిరాజుకు ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ డాక్టర్ ఐవీ సుబ్బారావు రైతు నేస్తం పురస్కారం లభించింది. విజయవాడలో 20వ తేదీ నిర్వహించిన కార్యక్రమంలో స్వర్ణ భారత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయనను ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా సత్కరించారు. గో ఆధారిత వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తున్నందుకుగాను తనను స్వర్ణ భారతి ట్రస్ట్ వారు ఎంపిక చేసి సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమానికి ఆంధ్ర తెలంగాణకు చెందిన మంత్రులు హాజరయ్యారని చెప్పారు.

నేటినుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కొయ్యలగూడెం: మండలంలో మంగళవారం నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లోని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ కేంద్రాలు నిర్వహిస్తారన్నారు. 22వ తేదీన పరింపూడి 1, 2, 3, 4, 5 సచివాలయాల్లో, అచ్యుతాపురం, గవరవరం, చొప్ప రామన్నగూడెం, పొంగుటూరు గ్రామాల్లో, 23న బయ్యనగూడెం 1, 2 సచివాలయాల్లో, సరిపల్లి, సీతంపేట, వేదాంతపురం, రామానుజపురంలో, 24న దిప్పకాయలపాడు, కన్నాపురం 1, 2 సచివాలయాల్లో, మంగపతిదేవిపేట, బోడిగూడెం గ్రామాలలో, 25న యర్రంపేట 1, 2 సచివాలయాల్లో, రాజవరం 1, 2 సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ ఈఈగా అహ్మద్ ఖాన్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం డివిజన్ విద్యుత్ ఈఈగా పీఆర్ అహ్మద్ ఖాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు ఏలూరు సర్కిల్ కార్యాలయంలో ఈఈ (టెక్నికల్)గా పనిచేస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన జంగారెడ్డిగూడెం వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈఈగా పనిచేస్తున్న పి.రాధాకృష్ణ ఏలూరు సర్కిల్ కార్యాలయంలో ఈఈ(టెక్నికల్)గా బదిలీ అయ్యారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ద్వారకాతిరుమల: కప్పలకుంట జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం. కలపర్రు టోల్‌ప్లాజాలో ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ప్రశాంత్ బైక్‌పై వెళుతూ ముందు వెళుతున్న లారీని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని నల్లజర్ల 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించడం లేదు

కుక్కునూరు: మండలంలో కుక్కునూరు నుంచి బూర్గంపాడు వరకు జరుగుతున్న ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణంలో నాణ్యత పాటించడం లేదని సీపీఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో షేక్ వలీ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటాపురం నుంచి కుదుములపాడు బ్రిడ్జి వరకు నిర్మాణం చేపడతారా లేదా అన్న సందేహం ప్రజల్లో నెలకొందన్నారు. ప్రస్తుతం చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల్లో మధ్యలో కొన్ని చోట్ల రోడ్డును తవ్వకుండా వదిలేశారని, దీంతో ఆయా ప్రదేశాలలో నిర్మాణం చేపడతారా లేక పాతరోడ్డును అలానే ఉంచుతారా అనే విషయం తేల్చాలన్నారు. అసలు రోడ్డు నిర్మాణానికి ఎంత నిధులు మంజూరయ్యాయో వెల్లడించాలన్నారు. రోడ్ల నిర్మాణ పనుల్లో సరిగా నీటితో తడపకపోవడంతో దుమ్ములేచి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు నిరంతరం రోడ్డు పనులను పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు యర్నం సాయికిరణ్, మహబూబ్ పాషా, పులదాసు రమేష్,పట్ల లక్ష్మయ్య, ఎం.డి.పుల్లు పాల్గొన్నారు.

కాలం చెల్లిన కల్వర్టులు

- ఏటా వర్షాకాలంలో కోతకు గురవుతున్న కల్వర్టులు
- పలు గ్రామాల మధ్య నిలిచిపోతున్న రాకపోకలు
- శాశ్వత వంతెనలు నిర్మించాలని కోరుతున్న ప్రజలు



మక్కినవారిగూడెం - కొల్లివారిగూడెం గ్రామాల మధ్య కోతకు గురైన కల్వర్టు వద్ద ఇసుక బస్తాలు వేసిన దృశ్యం

టి.నరసాపురం: మండలంలో పలు రహదారుల్లో కాలువలపై నిర్మించిన పైప్ కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. దీంతో వర్షాకాలంలో వాగులు పొంగి కల్వర్టుల వద్ద రోడ్డుపైకి ఎక్కి నీరు ప్రవహిస్తుండటతో పలు గ్రామాల మధ్య రహదారులు బంద్ అవుతున్నాయి. మండలంలోని ఎర్ర కాలువ, చింతలవాగు, జమ్మి కాలువలపై ఉన్న పైప్ కల్వర్టులు దాదాపు శిథిలావస్థకు చేరాయి. తాత్కాలిక మరమ్మతులు చేసి రహదారుల్లో రాకపోకలను పునరుద్ధరిస్తున్నా ప్రతి ఏటా వర్షాకాలంలో అవి కోతకు గురవుతూనే ఉన్నాయి. ప్రధానంగా మండలంలో టి.నరసాపురం, మక్కినవారిగూడెం గ్రామాల మధ్య కనకదుర్గమ్మ గుడి వద్ద వాగుపై ఉన్న పైప్ కల్వర్టు ప్రతి ఏటా కోతకు గురవుతోంది. అలాగే బండివారిగూడెం, అప్పలరాజుగూడెం గ్రామాల మధ్య మేకల వాగుపై ప్రతి ఏటా కల్వర్టు దెబ్బతిని ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. అలాగే బండివారిగూడెం, గంగినీడుపాలెం గ్రామాల మధ్య మక్కినవారిగూడెం, కొల్లివారిగూడెం గ్రామాల మధ్య జమ్మివాగుపై ఉన్న కల్వర్టులు కోతకు గురై రాకపోకలు స్తంభిస్తున్నాయి. ఆయా పైప్‌కల్వర్టుల స్థానే శాశ్వత ప్రాతిపదికన వంతెనలు నిర్మించాలని మండల ప్రజలు పదే పదే కోరుతున్నా ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడం లేదు. మండలంలో పలు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావడానికి ఉపయోగపడే ప్రధాన రహదారులు ఇవే. ప్రభుత్వ కార్యాలయాలకు, వైద్య సహాయానికి, నిత్యావసర సరుకులు, ఏ చిన్న అవసరమైనా పలు గ్రామాల ప్రజలు ఆయా రహదారుల గుండా ఇటు టి.నరసాపురం, అటు మక్కినవారిగూడెం, బండివారిగూడెం, అప్పలరాజుగూడెం గ్రామాలకు వెళ్లాల్సి ఉంది. పొలాల్లో పండిన పంటలు సైతం ఇదే రహదారుల గుండా ఇళ్లకు తీసుకురావాల్సి ఉంది. అలాగే చెరుకు, పొగాకు, పామాయిల్ వంటి పంటలను ఇవే రహదారుల గుండా రైతులు నిత్యం జంగారెడ్డిగూడెం తరలిస్తుంటారు. ఆయా రహదారుల ప్రాధాన్యతను గుర్తించి ఆయా వాగులపై శాశ్వత ప్రాతిపదికన వంతెనలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



అప్పలరాజుగూడెం - బండివారిగూడెం గ్రామాల మధ్య దెబ్బతిన్న పైప్ కల్వర్టు



టి.నరసాపురం - మక్కినవారిగూడెం గ్రామాల కల్వర్టు వద్ద కోతకు గురైన రోడ్డు

వెంటనే కల్వర్టులను నిర్మించాలి



రైతుల పొలాల్లో కొనుగోలు చేసిన కొబ్బరి కాయలను టి.నరసాపురం తీసుకురావడానికి రహదారులపై కల్వర్టులు దెబ్బతినడంతో నానా అవస్థలు పడాల్సి వస్తోంది. వర్షాకాలంలో రాకపోకలు బంద్ అవుతున్నాయి. దీంతో వ్యాపారం దెబ్బతిని జీవనోపాధి కష్టంగా ఉంటోంది. పైప్ కల్వర్టుల స్థానంలో వంతెనలను ప్రభుత్వం వెంటనే నిర్మించాలి.

– మాటూరి శ్రీనివాస్, కొబ్బరి కాయల వ్యాపారి, టి.నరసాపురం

సీఐ కృష్ణబాబుకు పురస్కారం



కలెక్టర్, ఎస్పీల చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న సీఐ వి.కృష్ణబాబు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సీఐ వి.కృష్ణబాబు విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు గాను పురస్కారాన్ని అందుకున్నారు. ఏలూరులో పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఇటీవల జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలో జరిగిన పలు దొంగతనాలకు సంబంధించి, సిబ్బందిని సమన్వయం చేసుకుని కేసులను ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో వివిధప్రాంతాల్లో చోరీకి గురైన 5 మోటార్‌సైకిళ్లు, 17.6 గ్రాముల బంగారం, 123 గ్రాముల వెండి, సెల్‌ఫోన్, రూ. 25 వేలు విలువైన టీవీని రికవరీ చేశారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణబాబు మాట్లాడుతూ సిబ్బంది సమిష్టి సహకారంతోనే ఈ కేసులు ఛేదించగలిగామని చెప్పారు.

పోలీస్ అమర వీరులకు ఘన నివాళి



చింతలపూడి: బొమ్మ సెంటర్‌లో మాట్లాడుతున్న సీఐ రవీంద్ర



బుట్టాయగూడెం: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



కొయ్యలగూడెం: పోలీస్ అమరవీరుల దినోత్సవ ర్యాలీ

జంగారెడ్డిగూడెం: ఎన్నో సవాళ్ల మధ్య పోలీసులు తమ సేవలను అందిస్తున్నారని డీఎస్పీ యు.రవి చంద్ర అన్నారు. జంగారెడ్డిగూడెంలో సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. బోసుబొమ్మ సెంటర్‌లో మానవహారం నిర్మించి, అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవిచంద్ర మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసులు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. అగిరిపల్లిలో అల్లరిమూకల దాడిలో విధులు నిర్వహిస్తూ అశువులు బాసిన కానిస్టేబుల్ గంధం నరేంద్రకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీఐ కృష్ణబాబు, ఎస్సై షేక్ జబీర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

●చింతలపూడి: పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని చింతలపూడిలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. చింతలపూడి సీఐ ఎం రవీంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది అమర పోలీసు వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పట్టణంలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆటో డ్రైవర్లు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ధర్మాజిగూడెం ఎస్సై కె వెంకన్న , చింతలపూడి పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●బుట్టాయగూడెం: శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగాలు చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవడం మనందరి బాధ్యత అని ఎస్సై డి.దుర్గా మహేశ్వరరావు అన్నారు. సోమవారం బుట్టాయగూడెంలో ర్యాలీ నిర్వహించి పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. ఏఎస్సై కె.సోమరాజు, కానిస్టేబుల్స్ నెదునూరి బాలకృష్ణ, పి.రాజేశ్వరరావు, ఎం.రామ్‌ప్రసాద్, ఎం.సత్యనారాయణ, సత్యనారాయణ రాజు, శ్యామల, రామలక్ష్మి, ఆటోయూనియన్ నాయకులు పాల్గొన్నారు.

●కొయ్యలగూడెం: పోలీసు అమరవీరుల దినోత్సవ ర్యాలీ సోమవారం కొయ్యలగూడెంలో నిర్వహించారు. ఎస్సై వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్టేషన్ ప్రాంగణంలోని పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఆగిరిపల్లిలో దుండగుల చేతుల్లో అశువుల బాసిన గంధం నరేంద్రకు నివాళులు అర్పించారు. ప్రకాశం కళాశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించి గణేష్ సెంటర్లో మానవహారం నిర్మించారు. ఏఎస్సై ఎం.సుబ్బారావు, హెడ్ కానిస్టేబుళ్లు జె.సింహాచలం, టి.బాబురావు, జయకుమార్, మంగారావు, బాలకృష్ణ, హేమలత, నాగలక్ష్మి పాల్గొన్నారు.

●ద్వారకాతిరుమల: ప్రజాస్వామ్య రక్షణకోసం పాటుపడి ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమర వీరుల సేవలు మరువలేనివని భీమడోలు సీఐ జోసఫ్ విల్సన్, స్థానిక ఎస్సై టి.సుధీర్ అన్నారు. ద్వారకాతిరుమలలో విద్యార్థులు, పోలీసులు సోమవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

●కుక్కునూరు: విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరవలేనివని కుక్కునూరు సీఐ రమేష్‌బాబు అన్నారు. సోమవారం కుక్కునూరులో ర్యాలీ నిర్వహించారు. ఎస్సై రామకృష్ణ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

●పోలవరం రూరల్: పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా పోలీసులు విద్యార్థులతో కలిసి సోమవారం పోలవరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో మానవహారం చేపట్టారు. డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అమరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ వారి ఆశయ సాధనలో పోలీసు శాఖ ముందుకువెళ్లాలన్నారు. సీఐ బాల సురేష్‌బాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు



కుక్కునూరు: అమరవీరుల దినోత్సవం సందర్భంగా ర్యాలీ



జంగారెడ్డిగూడెం: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పోలవరం రూరల్: స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో మానవహారం

మాజీ ఎమ్మెల్యే బాలరాజు పరామర్శ



దుర్గారావు సతీమణి అక్కమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బాలరాజు, తదితరులు

బుట్టాయగూడెం: కొవ్వాడ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చెరుకు దుర్గారావును మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సోమవారం పరామర్శించారు. మూడు రోజుల క్రితం దుర్గారావు సతీమణి అక్కమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న బాలరాజు దుర్గారావును పరామర్శించి అక్కమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంపీపీ, జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు సుంకర వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ రమణ కోటేశ్వరరావు, పార్టీ నాయకులు ములగల నాగేశ్వరరావు, రమణ నాగు, మడకం రవి, కుంజా శిరమయ్య, కపిలవాయి హరిసూర్యనారాయణ, తేనె రాజు, రమణ సత్తిబాబు, మార్గాని పోసి, తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ కాఫీ హబ్ పరిశీలన



అటవీ ఉత్పత్తుల వివరాలను వివరిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: గిరిజన మారుమూల గ్రామాల్లో వన్‌ధన్ వికాస్ యోజన కింద గిరిజన సంఘాలు ఏర్పాటు చేసుకున్న అటవీ ఉత్పత్తుల ప్రోసెసింగ్‌ను మార్కెటింగ్ విధానాన్ని ప్రోత్సహించేలా తమ వంతు కృషి చేస్తున్నామని డ్రీమ్స్‌డే సొల్యూషన్స్ కన్సల్టెన్సీ కంపెనీ(న్యూఢిల్లీ) వ్యవస్థాపకులు శ్వేత, నిఖిల్ తెలిపారు. సోమవారం వారు మండలంలోని ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేసిన వన్ ధన్ వికాస్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడ గిరిజనులు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించి వారి మరింత అభివృద్ధి చెందేందుకు అవసరమయ్యే సహకారాన్ని అడిగి తెలుసుకున్నారు. బుట్టాయగూడెంలోని జీసీసీ ఏర్పాటు చేసిన అరకు కాఫీ హబ్‌ను, సంత మార్కెట్‌లోని కారం ప్రోసెస్సింగ్ యూనిట్‌ను పరిశీలించారు. అక్కడ జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తులు, జీసీసీలో తయారు చేసిన ఉత్పత్తుల విక్రయాల గురించి జీసీసీ డీఎం, కేఆర్‌పురం ఇన్‌చార్జి జీసీసీ మేనేజర్ జి.పార్వతీశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ అకౌంటెంట్ రాజయోగి పాల్గొన్నారు.

రెండోరోజుకు పారిశుద్ధ్య కార్మికుల నిరసన

చింతలపూడి: జీతాల బకాయిలు చెల్లించాలని కోరుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న నిరసన కార్యక్రమాలు రెండో రోజుకు చేరాయి. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కూడా కార్మికులు ఆసుపత్రి ముందు నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు, మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ యూనియన్ అధ్యక్షురాలు టి మరియమ్మ మాట్లాడుతూ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఐదు నెలల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పోలవరం రూరల్: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు సోమవారం కూడా నిరసన కార్యక్రమం నిర్వహించారు. జీతాలు సరిగా ఇవ్వకపోవడంతో కుటుంబపోషణ కష్టంగా మారుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.

‘మీకోసం’కు అధికారుల డుమ్మా



మీకోసం కార్యక్రమంలో అధికారుల గైర్హాజరుతో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్న దృశ్యం

లింగపాలెం: ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమానికి పలు శాఖలను చెందిన అధికారులు డుమ్మా కొట్టారు. మరికొన్ని శాఖలకు సంబంధించి అధికారులు వారి కిందిస్థాయి ఉద్యోగులను పంపించడం విశేషం. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉపయోగపడే ఈ కార్యక్రమానికి అధికారులు గైర్హాజరుకావడంతో ఫిర్యాదు చేయటానికి వచ్చిన ప్రజలు నిరుత్సాహం చెందుతున్నారు. దీంతో ప్రజలు ఇక్కడకు రాకుండా జిల్లా కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో ఫిర్యాదులు అందజేస్తున్నారు. లింగపాలెంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఉదయం 11.15కు కేవలం తహసీల్దార్ నజీమ్, ఎంపీడీవో కె వాణీ తోపాటు మరో నాల్గు శాఖల అధికారులు మాత్రమే పాల్గొవడం గమనార్హం. సుమారు 23 శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు హాజరుకావాల్సి ఉండగా పట్టుమని పది శాఖలకు చెందిన అధికారులు కూడా పాల్గొనకపోవడం విశేషం. మండలాల్లో జరిగే మీకోసంపై జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షణ కొరవడడంతో తూతూ మంత్రంగా ఈ నిర్వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

విచారణ ఎదుర్కొంటున్న అధికారిణితో ఇక్కట్లు!

కొయ్యలగూడెం: ఐసీడీఎస్ శాఖలో విచారణ ఎదుర్కొంటున్న ఓ అధికారిణి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కార్యకర్తలు వాపోతున్నారు. ఆ అధికారిణితో వేధింపులకు గురైన కార్యకర్తలు సోమవారం విలేకరుల వద్ద తమ గోడు వెళ్ల బోసుకున్నారు. సూపర్‌వైజర్ స్థాయి కలిగిన ఆమె వేధింపులు, అవినీతి, అరాచకాలపై అక్టోబర్ 15న ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో తాము సామూహికంగా యూనియన్ నాయకుల చేత ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో కలెక్టర్, ఐసీడీఎస్ పీడీ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారన్నారు. అయితే, విచారణ ఇంకా ముగియకముందే ఆమె సెంటర్లను సందర్శిస్తుండటం, తమ ఉద్యోగ భద్రతపై భరోసా లేకుండా పోతుందన్నారు. పూర్వపు ఘటనలు మనసులో పెట్టుకున్న సూపర్‌వైజర్ పరోక్షంగా తమను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న సూపర్‌వైజర్‌ను ఓ ఉన్నత ఉద్యోగి వెనకేసుకు వస్తుండడంతో విచారణలో జాప్యం కలుగుతుందన్నారు. విచారణ త్వరగా ముగించి సూపర్‌వైజర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని యూనియన్ నేతలు, ప్రజా సంఘాలు, ఉద్యోగులు కోరుతున్నారు.

మోసం చేసిన నేరంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మోసం చేసిన నేరంపై ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీఎస్‌హెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. మండలంలోని అక్కంపేటకు చెందిన గూడుపు రామకృష్ణకు తండ్రి నుంచి సంక్రమించిన 0.33 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని తన పేరున మార్చేందుకు అదే గ్రామానికి చెందిన తారిపిరెడ్డి బాలాజీకి భూమి ఒరిజినల్ సర్టిఫికెట్‌లు ఇచ్చారు. ఈ క్రమంలో రామకృష్ణ నుంచి బాలాజీ కొంత సొమ్ము తీసుకున్నాడు. అయితే పాస్‌బుక్ మాత్రం చేయించలేదు. దీనిపై బాలాజీని ప్రశ్నించగా, మరికొంత సొమ్ము ఖర్చు అవుతుందని చెప్పాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించి తన పత్రాలు ఇమ్మని రామకృష్ణ అడగ్గా, బాలాజీ పక్కనే ఉన్న ములకాల కర్రతో తమపై దాడి చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.


వీర బ్రహ్మంకు ఆంధ్ర రత్న అవార్డు



ఆంధ్ర రత్న అవార్డును అందుకుంటున్న వీరబ్రహ్మం

చింతలపూడి: తెలుగు సాంస్కృతిక మహోత్సవ ఆత్మీయ పురస్కార అవార్డును చింతలపూడికి చెందిన కేఎల్ వీర బ్రహ్మం అందుకున్నారు. విజయవాడలోని ఏపీ స్టేట్ కల్చరల్ అవేర్నెస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రెస్ క్లబ్ భవనంలో తెలుగు సాంస్కృతిక మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హ్యాండీ క్రాఫ్ట్ తయారీలో తనదైన శైలిలో నైపుణ్యం ,ప్రతిభ కలిగిన వీర బ్రహ్మంకు ఆంధ్ర రత్న అవార్డు అందజేశారు. చెక్కలపై చేతితోనే అపురూప ఖండాలు చిత్రించడంలో వీర బ్రహ్మంకు ఎవరూ సాటి లేరని వక్తలు పేర్కొన్నారు.

మద్దిలో ఉత్సవాలపై సమీక్ష



మాట్లాడుతున్న మద్ది ఆలయ ఈవో చందన

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాసోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మద్ది ఆలయ ఈవో, అసిస్టెంట్ కమిషనర్ ఆర్‌వీ చందన తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు జరిగే కార్తీక మాసోత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, ఇందుకు అన్ని శాఖలను సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు. ఆర్డీవో కార్యాలయ ఏవో జీఎంసీ శేఖర్ బాబు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.